

# క్రైస్తవుడు ఛాలెంజ్! ? చెయ్యవచ్చా?

## క్రైస్తవులు, క్రైస్తవేతరులు ఒకరిపై మరొకరు బహిరంగ సవాల్ / పోటీ / చర్చ చేయవచ్చా?

నేటి నవనాగరిక సమాజంలోని రాజకీయ నాయకులు, రౌడీలు మొదలగు వారు.... ఒకరిపై మరొకరు బురద జల్లుకొంటూ ఎదుటివారితో సవాళ్ళు (ఛాలెంజ్‌లు) ప్రతిసవాళ్ళు విసురుతూ బహిరంగ పోటీలు లేదా చర్చలకు పిలుస్తున్నట్లే, దేవున్ని నమ్మిన ప్రజలు, దేవుని నమ్మని ప్రజలు కూడా ఎదుటివారిపై సవాళ్ళు విసురుతూ, బహిరంగ పోటీలు లేదా చర్చలు జరుపడం ఒక ఫ్యాషన్‌గా మారింది. 18వ శతాబ్దము నుండి శాస్త్ర-సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పులు, అభివృద్ధి, దానివలన మానవ జీవితంలో ఎంతో సుఖ-సంతోషాలు, మరెన్నో విషాదాలు కలుగుతున్నాయి. ప్రకృతి నుండి ఉద్భవించిన మానవుని మట్టి మెదడు నుండి పుట్టిన శాస్త్రాలు, వాటి అభిమానులు, ఈ సకల చరాచర ప్రకృతి

పుట్టుకకు దాని పరిణామానికి కారణభూతమైన ''శక్తి'' (దేవుడు)నే అనుమానించి, అవమానించే దశకు చేరుకున్నారు. కళ్ళకు కనబడేదే నిజం అని నమ్మే మానవ (అ)జ్ఞానానికి అందని ఎన్నో అంతుచిక్కని మహత్తరమైన అపురూపమైన సంగతులు ఈ సృష్టిలోనే ఉన్నాయి అనే సంగతిని మరిచిపోతున్నాడీ ఆధునిక మానవుడు. ఎప్పటికప్పుడు పరిణామం చెందే ప్రకృతిపై ఆధారపడిన శాస్త్రం కూడా ఎప్పటికప్పుడు మార్పులకు - చేర్పులకు లోనౌతుందనే సంగతిని గ్రహించని ప్రకృతివాదులు, అభ్యుదయవాదులు భయంకరంగా మోసపోతూ అనేకులను మోసపరుస్తున్నారు.

ఉదా : మనం నివసిస్తున్న భూమి బల్లపరుపుగా ఉంది, నక్షత్రాలు కదలడం లేదు అన్నాడు ఒకప్పటి మన గొప్ప ఖగోళ శాస్త్రవేత్త ఆర్యభట్ట. కాని భూమి గుండ్రంగా ఉంది, ఈ అనంత విశ్వంలోని ప్రతి నక్షత్రం, గ్రహాలు, ఉపగ్రహాలు కదులుతున్నాయంటుంది నేటి శాస్త్రం. ఒకప్పుడు తాను చూచిన దానిని బట్టి మనిషి కోతి నుండి వచ్చాడన్నాడు డార్విన్. కోతి నుండి మనిషి పరిణామం చెందితే ఇప్పటికే ఎన్నో వేల సంవత్సరాలు అయింది గనుక కోతి జాతి నశించిపోవాలి గదా! అది పరిణామ లక్షణం అని శాస్త్రం కూడా అంటుంది గదా! అలాగే కోతి నుండి మనిషిగా మారకముందు ఏ రూపంలో ఉన్నాడు మనిషి. ఈ రూపం తర్వాత ఎన్నివేల సంవత్సరాలకు ఏరూపంలోకి రూపాంతరం చెందుతాడని అడిగితే సరియైన సమాధానం చెప్పలేని ఈ జన విజ్ఞానం, మహోన్నతమైనది, సర్వశక్తిసంపన్నమైన దైవజ్ఞానాన్ని సవాల్ / ఛాలెంజ్ చేయడం ఎంతవరకు న్యాయమో ఆలోచించండి. జీవరాశుల డి.యన్.ఏ. శాస్త్రం ఎప్పుడైతే ఆవిష్కరించబడిందో అప్పుడే డార్విన్ సిద్ధాంతం మట్టికొట్టుకొని పోయింది. మనిషి మెదడును కలుగజేసిన దేవుడు ఈ విషయాలన్నింటిని ముందే మన బ్రతుకు పుస్తకమైన బైబిల్‌లో పరిణామ వాదం తప్పని ఎప్పుడో చెప్పాడని మరువవద్దు సుమా! (ఆది. 1:1-31, 1కొరింథీ 15:37-41, యోబు 9:6, 26:7, 37:12, 38:31-33).

ఇకపోతే దేవునిని నమ్ముతున్నామంటున్న మనుషులలో నేడు మతపిచ్చి ఎక్కువై మతి తప్పి మృగాల కన్నా హీనంగా ప్రవర్తిస్తున్నారు. ఈ మధ్యనే కొందరు పనిగట్టుకొని ఎక్కువగా క్రైస్తవులతో చర్చలు, బహిరంగ పోటీలు నిర్వహిస్తూ క్రైస్తవుల విశ్వాసానికి వ్యతిరేకంగా కరపత్రాలు పంచుతూ అనేకులను కలవరపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. వారిలాగే కొందరు క్రైస్తవులు కూడా మిడిమిడి జ్ఞానంతో ఇతర మతాలను, నాస్తిక హేతువాదులను, శాస్త్రవేత్తలను, దేశాధినేతలను, న్యాయ

మూర్తులతోపాటు రాజకీయ నాయకులను కూడా సవాల్ చేస్తున్నారు. అనవసరంగా ఎదుటివారిని మరియు బలహీనులైన విశ్వాసులను రెచ్చగొడుతూ క్రైస్తవ్యాన్ని కాపాడేది మేమేనని ప్రచారం చేసుకొంటూ, స్వపక్షాన్ని అవమానపరుస్తూ ఆస్తులను సమకూర్చు కొంటున్నారు. వారు స్పందించకపోయేసరికి మేమే గెలిచామని జబ్బ చరుచుకొని గోబెల్స్ లా ప్రచారం చేసుకొంటున్నారు. బైబిల్‌పై సరియైన అవగాహన లేని అమాయక క్రైస్తవులు వారి మోసాన్ని గ్రహించలేక వీరి వలలో పడి అన్యాయమైపోతున్నారు. నేటి కాలంలో క్రైస్తవుడు గాని, మరొకడు గాని వేరే మతస్థులైన లేదా విశ్వాసులైన తమ ప్రత్యర్థులపై సవాల్ విసిరి, పోటీకి - చర్చకు పిలవడం వాక్యానుసారమా? ఈ లోకన్యాయం ప్రకారంగా ఇది జరిగేపనేనా? అని కూడా ఎవరూ ఆలోచించడం లేదు. కేవలం సవాల్ చేసి పేరు ప్రఖ్యాతులతో పాటు ధనార్జన చేసుకొని అనేకులను మోసపర్చుచున్నారీ మాయ బోధకులు (అన్నిమతాలలో కూడా) పోటీలు, సవాల్‌లు ఉండాలంటున్న క్రైస్తవులు చెప్పేదేమిటంటే అపోస్తలుడైన పౌలు ఛాలెంజ్‌లు చేశాడు. తర్కించి, వాదించి ఒప్పించాడు గదా అనే రెఫరెన్స్‌లు చూపుతున్నారు. అయితే వాటిని లోతుగా ఆలోచించి అవి అలాగున ఉన్నవో లేవోనని దేవుని వాక్యాన్ని పరిశోదిద్దాం. (అపొ.కా. 17:10,11, మార్కు 4:24).

"పౌలు తనవాడుక చొప్పున సమాజపు వారి యొద్దకు వెళ్ళి క్రీస్తు శ్రమపడి మృతులలో నుండి లేచుట అవశ్యమనియు, నేను మీకు ప్రచురము చేయు యేసే - క్రీస్తు అయివున్నాడనియు లేఖనములలో నుండి దుష్టాంతముల నెత్తి విప్పి, చెప్పుచూ, వారితో మూడు విశ్రాంతి దినములు తర్కించుచుండెను." (అపొ.కా. 17:1-6, 18:18-23, 19:7-9).

"నా బంధకముల యందును, నేను సువార్త పక్షమున వాదించుటయందును, దానిని స్థిరపరచుట యందును, మీరందరు ఈ కృపలో నాతో కూడా పాలివారైయున్నారు గనుక నేను మిమ్మును నా హృదయములో ఉంచుకొని యున్నాను (ఫిలిప్పీ 1:7-11).

"యేసే క్రీస్తు అని లేఖనముల ద్వారా అతడు (అపొల్లో) దృష్టాంతపరచి, యూదుల వాదమును బహిరంగముగాను, గట్టిగాను ఖండించుచువచ్చెను. (అపొ.కా. 18:28).

పై లేఖన భాగములను ఆత్మతో జాగ్రత్తగా లేఖనానుసారంగానే పరిశీలించినట్లయితే మొదటి శతాబ్దంలో పౌలుగారు, మిగతా శిష్యులందరు వాదించి - తర్కించి / ఒప్పించినది కేవలము తమ జాతి

లేదా తమ మతమువారైన యూదులతో మాత్రమేనని గమనించాలి. ఎందుకంటే లేఖనములు కలిగి వాటిని బాగా ఎరిగిన వారే తప్పుడుగా బోధిస్తుంటే అనగా యేసు దేవుని కుమారుడైన క్రీస్తు కాదంటున్న యూదులనే సవాల్‌చేసి, లేఖనముల ప్రకారము యేసే క్రీస్తు అని రుజువు చేసి దేవుని రాజ్య సువార్తను స్థిరపరచినారు. (రోమా 1:1-15, 14-21, హెబ్రీ 1-4, అపొ.కా. 28:3-31) అపొస్తలుల చేత, శిష్యులచేత స్థిరపరచబడిన సువార్తను, దేవుని ప్రియ కుమారునిగా నిరూపింపబడిన క్రీస్తును ప్రకటిస్తూ వెళ్ళడమే నేటి క్రైస్తవుని ప్రథమ కర్తవ్యం (మార్కు 16:15,16, మత్తయి 28:18-20) ఎవరు నమ్మినా, నమ్మకపోయినా మనకనవసరం. అది దేవుడు చూసుకొంటానన్నాడు. బ్రతిమాలడం, భయపెట్టడం, లోకాశలు చూపించడం, అనవసరంగా విమర్శిస్తూ, దూషిస్తూ, అవహేళన చేస్తూ సవాల్ చేయడం బైబిల్‌లోని క్రీస్తు బోధకు వ్యతిరేకం. సమస్త విధములైన అనుభవజ్ఞానముతో మన నిరీక్షణను గూర్చి హేతువు అడిగిన ప్రతివానికి సాత్వీకముతో సమాధానం చెప్పడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి (1పేతురు 3:13-18). కానీ వీధి రౌడివలె సవాల్ చేయకూడదు. ఒకసారి రుజువు చేయబడిన క్రీస్తును మళ్ళీ మళ్ళీ రుజువు చేయవలసిన అవసరం లేదు.

దేవుడు మాట్లాడని చోట మనం మాట్లాడితే నిత్యాగ్నిదండనే, కొందరు బోధకులు అతి తెలివితో ఏలియా సవాల్ చేశాడు గదా అనవచ్చు. అది పాత నిబంధనకాలం, అప్పుడు దేవున్ని నమ్మని వారిని, ఇశ్రాయేలీయులను ఎదిరించిన వారిని నరికెయ్యమని కూడా దేవుడే చెప్పాడు. మరిప్పుడు కూడా దేవున్ని కాదన్న వారిని నరికేద్దామా? ఇప్పుడు మనం ఉన్నది క్రొత్తనిబంధన కాలంలోని క్రీస్తు బోధలో కాబట్టి ప్రేమతత్వంతో మనల్ని హింసించిన వారి కోసం ప్రార్థించి, దీవించాలి (రోమా 12:9-21, మత్తయి 5,6,7 అధ్యాయాలు) కాలాన్ని బట్టి బైబిల్ చదవాలి, బోధించాలి (1పేతురు 1:10-12) కాని ఈ లోకం పద్ధతులు పాటించగూడదు. లోక పద్ధతులలో కూడా ఇతరులపై సవాల్ చేసే న్యాయం లేదు. అనేక విషయాలలో తమకు తెలిసిన జ్ఞానం / విశ్వాసంలోనే సమ ఉజ్జీలైన వారితోనే పోటీ జరగాలి. అదే దేవుడు నియమించిన నియమం. ఇప్పుడు ఈ లోకంలో ఉన్న వారు కూడా పాటిస్తున్న నియమం గూర్చి కూడా జాగ్రత్తగా ఆలోచించి పరిశీలిద్దాం, అందరి కళ్ళు తెరిపిద్దాం.

"నేర్పులేని మూఢుల వితర్కములు, జగడములు పుట్టించునని ఎరిగి అట్టివాటిని విసర్జించుము (2తిమోతి 2:23-26, 1తిమోతి6:3-5, తీతు3:8-11).

మరియు జెట్టియైనవాడు పోరాడునప్పుడు నియమం ప్రకారం పోరాడకుంటే వానికి కిరీటము దొరకదు" (2తిమోతి 2:5, 4:1-8)

నియమము, పద్ధతి ప్రకారము మరియు నేర్పుతోనే ఏ పోరాటమైనా, తర్కమైనా, పోటీ అయినా, చర్చలైనా ఉండాలి అని అర్థమగుచున్నది. ఇది తెలియకనే ఈ మానవ సమాజంలో అనేకుల మధ్య వ్యర్థ వివాదములు, అపార్థములు, కక్షలు మత కలహాలు, మారణహోమాలు, జీహాదీలు కలుగుచున్నవి. ఎవరినైనా అవతలిపక్షం వారితో మంచిగా పోరాడ మంటున్నాడు. మంచి అనగా మనుషులందరి జీవగ్రంథమైన బైబిల్‌ను బట్టి దేవుని కిష్టమైన పోరాటమంటే సమయమందును అసమయమందును సువార్తను ప్రకటించడమే. అలాగే నీ స్వపక్షమునకు సంబంధించినవారే తప్పుడు బోధలు చేస్తే వారి బోధను (వారినికాదు) మాత్రమే ఖండించి, బుద్ధి చెప్పమంటున్నాడు. అనగా క్రైస్తవులు అవసరమైతే పోటీపడి చర్చించి బుద్ధి చెప్పాల్సింది దుర్బోధకులైన క్రైస్తవులతోనే గాని వాక్యం తెలియని వారితో కాదు. అనగా బైబిల్‌పై పూర్తిగా అవగాహనలేని వారైన, లేదా తప్పు పట్టడానికే సంగతులను పైపైన చూస్తున్న కొందరు ఛాందసవాదులు, నాస్తిక - హేతువాదులు, రాజకీయ నాయకులు అసలు మనజోలికే రాని శాస్త్రవేత్తలతో పోటీపడకూడదు. వారిపై సవాల్ విసరకూడదు ఒకవేళ అజ్ఞానంతో వారు సవాల్ విసిరినా మనం స్పందించకూడదు. ఎందుకనగా లోకంలో నిత్యం జరుగుచున్న కొన్ని వాస్తవ విషయాలను గూర్చి ఆలోచిద్దాం.

మనలో అందరికీ ఆటల పోటీలు / స్పోర్ట్స్ అంటే చాలా ఇష్టం కదా! ప్రతి ఒక్కరికి ఏదో ఒక క్రీడ అంటే అభిమానం తప్పక ఉంటుంది. అయితే క్రికెట్ ఆట తెలిసిన వారెవరైనా ఫుట్‌బాల్ ఆటగాడిని తనతో పోటీకి రమ్మని సవాల్ విసరడం చూశారా? కోడి పందాలలో రెండు కోళ్ళ మధ్యనే పోటీ జరుగుతుంది గాని ఒక ఎద్దుతో ఒక కోడి పోటీపడడం ఏనాడైనా జరిగిందా? ఆలోచించండి. ప్రపంచంలో అన్ని క్రికెట్ జట్లమధ్యనే పోటీ జరుగుతుంది కానీ, ఫుట్‌బాల్ జట్లతో జరగదు. క్రికెట్‌లో బౌలర్ వేసిన బంతిని, వైడ్‌బాల్ అనో, నో బాల్ లేదా డెడ్‌బాల్ మరియు ఎన్ని రన్స్ ఇవ్వాలో చెప్పాల్సింది మైదానంలోని క్రికెట్ అంపైర్లు లేదా మూడో అంపైర్ చెప్పాలి గాని టివి చూస్తూనో లేదా స్టాండ్‌లో కూర్చున్న ఫుట్‌బాల్ రెఫరీ చెప్పగూడదు గదా! ప్రతి ఆటకు కొన్ని నియమనిబంధనలు, కోచ్‌లు, ఎంపైర్లు ఉంటారు. ఒకరి జోలికి మరొకరు వెళ్ళరు, ఒకరి మీద మరొకరు కామెంట్ చేయరు, ఒక ఆటతో ఇంకో ఆటను సరిపోల్చరు. దేని విలువ, ప్రత్యేకత దానికే ఉంటుంది. వాలీబాల్

ఆటగాడు కబడ్డీ ఆటగాన్ని సవాల్ చేస్తే పిచ్చివాడంటాము గదా! మరియు టెన్నిస్ ఆటలోనే టేబుల్ టెన్నిస్ వేరు, లాన్ టెన్నిస్ వేరే గదా! అలాగే ఇంజనీరింగ్‌లో మెకానికల్ ఇంజనీర్, సివిల్ ఇంజనీర్‌తోను, ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్‌తోనో పోటీపడడనే నియమము, నీతి ఈనాటి మత చాంధసులు మర్చిపోవడం నిజంగా నేటి మానవజాతి ధౌర్భాగ్యం. ఇలా డాక్టర్లు, లాయర్లు ఎందరిని గూర్చో, ఎన్నెన్నో చెప్పుకోవచ్చు.

ఇదంతా ఎందుకు ఉదహరించానంటే మనం ఉదాహరణగా క్రికెట్ ఆటను బైబిల్‌తోను, ఖురాన్‌ను ఫుట్‌బాల్‌తోను, భగవద్గీతను వాలీబాల్‌తోను, శాస్త్రాన్ని కబడ్డీతోను, ఆస్తికులను చెస్‌తోను, నాస్తికులను కుస్తీపోటీతోను పోల్చి చూసుకొన్నప్పుడు ఎవరు ఎవరితో పోటీపడాలో ఆలోచించండి. అందుకే ఒకరి విశ్వాసం, నేర్పరితనం, అందులోని సంపూర్ణ జ్ఞానం మరికరికి లేదు గనుక సంగతులు పూర్తిగా తెలియని వారితో తర్కించడం, వాదించడం, పోటీపడడం మూర్ఖత్వము కాదా? బోధలో తేడావస్తే క్రైస్తవ్యానికి చెందినవాడు బైబిల్ కలిగిన క్రైస్తవుడితోనే పోటీపడాలి. ఎవరి విశ్వాసం బైబిల్ ప్రకారంగా ఉందో చూసుకోవాలి. అలాగే ఖురాన్‌కు సంబంధించిన వారు ఖురాన్ బాగా తెలుసు అంటున్న ముస్లింలతోనే పోటీకి దిగి ఎవరిజ్ఞానం గొప్పదో తేల్చుకోవాలి. ఇలా భిన్నమైన విశ్వాసం లేదా మనస్తత్వం గలిగిన వారు పోటీకి దిగితే ఎలా ఉంటుందంటే ఫుట్‌బాల్ రెఫరీ క్రికెట్‌కు అంపైరింగ్ చేసినట్లుంటుంది. భారతదేశ చట్టప్రకారం, దేవుని చట్టమైన బైబిల్ న్యాయం ప్రకారం గాను ఒకరి విశ్వాసాన్ని మరొకరు తప్పుపట్టకూడదు, విమర్శించకూడదు. ఎవరి విశ్వాసాన్ని వారు నియమము ప్రకారం ప్రకటించుకోవాలి. అలా చేయకపోతే శిక్షార్హులు. శాస్త్రవేత్త యం.యస్.సి. అయితే దైవజనుడు యం.ఏ. అయితే ఇద్దరికి కాంపిటీషన్ గాని కంపేరిజన్ (సరిపోల్చడం) గాని ఎలా కుదురుతుంది. ఇలా ఒకరి జోలికి మరొకరు ఎట్టి పరిస్థితులలోను వెళ్ళకూడదు. వెళితే ఇక్కడా శిక్షే, మరోలోకం కూడా శిక్షే సుమా!

సహనశీలురుగా పేరొందిన మన దేశంలోని కొన్ని మతాల సోదరులు కూడా నేడు క్రీస్తును, క్రైస్తవ్యాన్ని పనిగట్టుకొని విమర్శిస్తూనే, తమను విమర్శించినా, విమర్శించకపోయినా క్రైస్తవుల ఆస్తులను, ఇండ్లను, చర్చీలను కూల్చుతున్నారు, ఓపికలేని మత తత్వవాదులైతే దేవుని పేరుమీదనే క్రైస్తవుల మాన-ప్రాణాలను కూడా బలితీసుకుంటున్నారు. ఒకవేళ ఏమత ఛాందసవాదులైనా తప్పుగా మాట్లాడినా, తప్పుచేసిన వారిపై దేశ చట్టప్రకారంగా శిక్షపడేలా చేయాలిగాని చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం ఎంతవరకు న్యాయమో ఆలోచించాలి. అలాగే ముస్లింలు కూడా కరపత్రాల ద్వారా, క్యూటి.వి. ద్వారా క్రైస్తవులను, హిందువులను

విమర్శిస్తూ, యేసు సిలువలో మరణించలేదని, యేసు దేవుని కుమారుడే కాదని సున్నితమైన క్రైస్తవుల మనోభావాన్ని, విశ్వాసాన్ని కించపరుస్తున్నారు. వారి మతగ్రంథాన్ని గాని, వారి ప్రవక్తను గాని విమర్శిస్తూ ఎక్కడో ఏదో దేశంలో కార్టూన్ వేస్తే ఇక్కడ హైదరాబాద్‌ను తగలబెడుతున్నారీ శాంతి కాముకులు. వారి మతగ్రంథంలో తప్పులున్నాయన్న వారిపై / వారికి మరణదండన విధిస్తున్నారు. ఇదెక్కడి న్యాయం, ధర్మమో, శాంతో ఆలోచించండి. ఇలాంటి మతచాందసవాదం, ఎంతకాలం చెల్లుతుంది? అనవసరంగా అన్యాయంగా ఇతరుల జోలికెళ్ళమని చెప్పిన ఏ గ్రంథమైనా దైవగ్రంథం కాగలదా? క్రైస్తవులు క్రీస్తు బోధ ప్రకారం తమను హింసించిన వారికోసం ప్రార్థన చేసే కరుణామయుని శిష్యులు గనుకనే తమ జోలికొచ్చిన వారిమీద కోర్టుకెళ్ళడం గాని, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం లేదని గ్రహించండి. చట్టాన్ని ఉపయోగించికొని మూర్ఖంగా మాట్లాడే వారి నోరు (2పేతురు 2:15) మూయించమని బైబిల్ చెప్పినా (మత్తయి 10:16-17, లూకా 15:58,59, అపొ.కా. 22:22-29) దేవుని జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను క్రైస్తవులు చూపిస్తున్నారని మరచిపోకండి పవిత్ర భారతదేశంలోని నా క్రైస్తవేతరసోదరుల్లారా!

కాబట్టి ప్రియమైన దేవుని ప్రజలైన నా సోదర భారతీయులారా! ఒకే దేవుని పిల్లలమైన మనం మతాల పేరుతో మారణ హోమం చేస్తూ మానవత్వాన్ని మరచి మృగంలా బ్రతుకక, దేవత్వంతో ఎదుటి వారి నమ్మకాన్ని గౌరవించాలే గాని తప్పుగా మాట్లాడకూడదు. ఒకవేళ పోటీపెట్టినా ఎవరు కూడా తనది తప్పైనా తప్పును ఒప్పుకోడు. గెలిచిన వాడి మతం - మార్గంలోకి మారడు. ఇప్పటి వరకు ఈ ప్రపంచంలో, మన దేశంలో, ఈ ఆంధ్ర రాష్ట్రంలోనూ, మన రాజధానిలోనూ ఎన్నో పోటీలు, చర్చలు జరిగాయి. ఎవరు తమ తప్పును ఒప్పుకున్నారో ఎంతమంది ఇలాంటి చర్చల ద్వారా మారిపోయారో చూపించండి. ఈ పోటీల ద్వారా మారినవాడు గాని వీటిని నిర్వహించే వారు గాని, ఈ పోటీలకు వెళ్ళేవాళ్ళు కూడా అల్ప సంతోషులే సుమా! పైగా ఈ పోటీల వల్ల ద్వేషం పెరిగి దేవుడంటేనే అసహ్యం ఏర్పడి అనేకులు ఎటూపనికిరాని దేశదిమ్మరులైపోయి నాశనానికి గురైపోతున్నారు. ఇంతకు బైబిల్‌కు శాస్త్రవేత్తకు, ఖురాన్‌కు భగవద్గీతకు గాని పోటీ జరిగితే జడ్జిమెంట్ ఎలా, ఎంతటి జ్ఞాని చెప్పాలి అని ఆలోచించండి. ఇదంతా పేరు, డబ్బు కోసం కొందరు ఆడుతున్న నాటకాలు. కాబట్టి పరుల జోలికెళ్ళి కొరివితో తలగోక్కోకుండా, ఈ పోటీల వల్ల ఎవరికి మేలు జరుగదని గ్రహించుకొని ఒళ్ళు దగ్గర పెట్టుకొని బ్రతుకుదాం. దేశంలోని శిక్షలతో పాటుగా దేవుని శిక్షకు గూడా గురి కావాల్సివస్తుందని భయపడండి. ఎవరి మార్గము లేదా మతము

కరెక్టో మనం చనిపోయాక మాత్రమే తెలుస్తుంది. బాధపడితేనే గాని బోధపడదు గనుక, చేతులు కాలకముందే ఆకులు పట్టుకోండి. ఎవరి విశ్వాసాన్ని వారే పరీక్షించుకోండి (2కొరింథీ 13:5) దేవున్ని రుచి చూసి అనగా ఆయనలో లీనమై దైవత్వాన్ని గ్రహించండి. మనం పోరాడవలసింది, పోటీపడవలసింది, యుద్ధం చేయాల్సింది (జీహాద్) శరీర సంబంధమైన మనుషులతో శారీరకంగా కాక, కనబడకుండా మనల్ని నరకానికి నడిపిస్తున్న సాతానుగాడితోనూ వాడి అనుచరులైన అబద్ధపు ప్రవక్తలు, అబద్ధ క్రీస్తులు, దొంగ అపొస్తలులతోనే అని విషయం మాత్రం మర్చిపోకండి (2కొరింథీ 10:3-6, ఎఫెసి. 6:10-17). దేవుడు సర్వలోకానికి సువార్తను ప్రకటించమన్నాడే గాని సువార్తను బహిరంగ పోటీలలో సవాల్ చేసి, వాదించి, ఓడించి ఒప్పించమనలేదు. ప్రేమతో ఇతరుల హృదయాలను జయించాలితప్ప ఛాలెంజ్‌లతో కాదని తెలుసుకోవాలి.

సోదర సోదరీమణులారా! ప్రపంచంలోని ప్రజలందరికి దేవుడొక్కడేనని, ఆయనను చేరే రక్షణమార్గము కూడా ఒక్కటేనని బైబిల్‌లో చెప్పిన విషయాలను మీ వద్దనున్న గ్రంథాలలోని విశ్వాసాలతో సరి చూసుకొని అనగా సమస్తమును పరీక్షించి మేలైనదానిని చేపట్టండి. మీ దైవత్వాన్ని తమ క్రియలతో చూపండి. మనం మంచివారము అని చెప్పడానికి ఎదుటి వాడిని దొంగ అని అనవలసిన అవసరం లేదుకదా! సర్వమానవ సౌభ్రాతృత్వమే దేవుని అనాది సంకల్పమని (ఎఫెసి 1:3-12) గ్రహించి మన ఇంటిని, ఊరూ - వాడలను, దేశాన్ని ఒక దేవాలయంగా మారుద్దాం. నిత్య జీవాన్ని సంపాదించుకొని దేవలోకంలో (పరలోకంలో) యుగయుగాలు దేవునితో కలిసి జీవిద్దాం. బైబిల్‌పై మీకున్న ప్రశ్నలకు, అనుమానాలకు, పూర్తి వివరాల కోసం ఎల్లవేళలా ఈ క్రింది చిరునామాలలో సంప్రదించండి.

---

**Dr. JOHN BONKURI,** Director
**Institute of Bible Technology Hyd & Temples of God Meets Here Church**
Ph : 040-20000700 Cell : 9440142887, www.bibletechnology.net
e-mail : johnbonkuri@bhelhyd.co.in bibletechnology@gmail.com

**Office & Residence :** #06-264/13/1/5H, HAL Raghavendra Colony,
Opp. Godavari Homes,Suchitra Bus Stop to Quthbullapur Road,
Chintal Post, Quthbullapur GHMC, Hyd - 500 054, India

**for Free Bible Training** contact : **Bro. J. RAVI,** Admn. Officer - IBT,
H.No. 7-1-38/1/33, BJR Nagar, Ameerpet, Hyd-16,
Cell : 9440792192, 9959372221, 9440551149, 9676744233, 9493979644
**R.K. Evangelical Marketing,** 9704692533